
# లక్ష్మీనరసింహుడికి వైభవంగా నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, అక్టోబర్17 : యాదగిరిగుట్ట ప్రధానాలయంలో లక్ష్మీనరసింహ స్వామికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను కనులపండవగా నిర్వహించారు. స్వామివారికి సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి గజవాహన సేవ నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. దేవి శరనవరాత్రోత్సవాల్లో భాగంగా అనుబంధ శివాలయంలో ఉదయం ప్రాతః కాల పూజ, మధ్యాహ్నిక చతుశ్షష్టి పూజ, సాయంత్రం నవావరణ పూజలు ఘనంగా నిర్వహించారు. అన్నపూర్ణదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ. 18,35,282 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్. గీత, అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.



లక్ష్మీనరసింహ స్వామికి నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



# కేసీఆర్ బీమా.. ఇంటింటికీ ధీమా..

## ఆపత్కాలంలో అండగా సీఎం కేసీఆర్

- కుటుంబ పెద్దను కోల్పోయిన క్షణంలో ఆర్థిక భరోసా
- కారణంతో సంబంధం లేకుండా రూ.5లక్షల బీమా
- రూ.4వేల ప్రీమియం ప్రభుత్వమే చెల్లింపు
- తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలంతా అర్హులే
- మ్యానిఫెస్టోలో పొందుపర్చిన బీఆర్ఎస్
- రైతుబంధు తరహాలోనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటన
- జిల్లాలో 2,03,335 కుటుంబాలకు ప్రయోజనం
- మానవీయ కోణంలో గొప్ప పథకమంటూ ప్రశంసలు

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా రైతు బీమాను తీసుకొచ్చింది. ఏ కారణంతో చనిపోయినా రూ. 5 లక్షల బీమా వర్తిస్తుంది. 18 నుంచి 59 ఏండ్ల వయసున్న వారు దీనికి అర్హులు. ఎల్ఐసీ ద్వారా అమలు చేస్తున్నారు. సదరు వ్యక్తి చనిపోయిన వారం, పది రోజుల్లోనే నామినీకి రూ.5లక్షల బీమా అందిస్తున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్నది. అయితే కేసీఆర్ బీమా పథకానికి ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని ప్రభుత్వమే కడుతుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఒక్కో ప్రీమియం సుమారు రూ. నాలుగు వేల వరకు ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ. 82 కోట్లు ఎల్ఐసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఇదే తరహాలో ఇటీవల చేనేత కార్మికులు, గీత కార్మికులకు కూడా వర్తింపజేశారు.

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ)

### 2,03,335 కుటుంబాలకు లబ్ధి

తెల్లకార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ బీమా సదుపాయం కల్పించనున్నారు. జిల్లాలో 2,03,335 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. ఎన్నికల్లో గెలిచిన తెల్లారి నుంచి ఈ పథకానికి శ్రీకారం చుడుతామని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. దీంతో ఇంటి పెద్ద దిక్కు చనిపోతే బీమా పథకం ద్వారా వెంటనే సాయం అందడంతో ఆర్థికంగా వెసులుబాటు కలుగనుంది. పిల్లల చదువులు, పెళ్లిండ్లు, ఇతర ఖర్చులకు ఎంతో ఉపయోగపడనున్నది. సీఎం కేసీఆర్ ప్రకటనపై సబ్బండ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### పేద కుటుంబాలకు వరం



ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన బీమా ప్రతి నిరుపేద ఇంటికి ధీమా కల్పిస్తుంది. రైతు బీమా తరహాలో తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వమే పూర్తిస్థాయి బీమా సొమ్మును చెల్లించే విధంగా పథకం ప్రకటించడం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పేదల సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. 93 శాతం ఉన్న తెల్లరేషన్ కార్డుల లబ్ధిదారులకు మేలు చేసే ఈ బీమా పథకం దేశ చరిత్రలోనే సంచలనమవుతుంది. ఈ బీమా పథకం నిరుపేదల కుటుంబాలకు వరంలాంటిది. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న బీఆర్ఎస్ సర్కారు ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయం.

–కీసర్ల సత్తిరెడ్డి, గోపరాజుపల్లి, వలిగొండ మండలం

### ఉచితంగా బీమా చేస్తామనడం గొప్ప విషయం



పేదల కోసం బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ బీమా పథకం తీసుకురావడం గొప్ప విషయం. తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఇంటికీ 5 లక్షల బీమా కల్పించడం హర్షణీయం. రైతుబీమా తరహాలో సీఎం కేసీఆర్ ఈ పథకంపై నిర్ణయం తీసుకోవడం పేదలకు కొండంత భరోసా నింపినట్లే. ఒక్కో కుటుంబానికి ఇది ఎంతో ఆసరా అవుతుంది. మానవతా దృక్పథంతో తీసుకొచ్చిన బీఆర్ఎస్ సర్కారు ప్రజలు అండగా నిలుస్తారు.

–బాల్ద సిద్దులు, బొందుగుల, రాజాపేట మండలం

### పేదల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్



బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన కేసీఆర్ బీమా పథకం పేద ప్రజలకు ఎంతో ధీమాను ఇస్తుంది. ఇప్పటివరకు రైతులకు, చేనేత కార్మికులకే పరిమితమైన ఈ పథకం బీపీఎల్ కుటుంబాలకు అమలు చేస్తానని చెప్పడం సంతోషదాయకం. పేదలు ఏకారణం చేతనైన చనిపోయినా 5లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. ఈ పథకంతో పేద కుటుంబాలకు భరోసా కలుగుతుంది. పేదల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– బద్దుల ఉమా, బోగారం, రామన్నపేట మండలం

### చరిత్రాత్మక పథకం



ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమాగా మారుతుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మరో చారిత్రాత్మకమైన పథకం తీసుకురావడం హర్షణీయం. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 5 లక్షల కేసీఆర్ బీమా చేయడం పేదలకు వరంలాంటిది. ఇన్ని చేస్తున్న బీఆర్ఎస్ సర్కారుకు ప్రజలు అండగా ఉంటారు.

–శిగ మల్లేశం, ఆత్మకూరు(ఎం)

### నిరుపేదల జీవితాలకు భరోసా సీఎం కేసీఆర్



బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో కేసీఆర్ బీమా పథకం ప్రవేశపెట్టడం అభినందనీయం. సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి. నిరుపేద జీవితాలకు ఎల్లవేళ్లలా భరోసా ఇస్తున్నారు. కేసీఆర్ వల్లనే పేదలు నేడు ప్రశాంతంగా జీవిస్తున్నారు. ప్రతి పేద కుటుంబానికి బీమా సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉంది. ఆరోగ్య శ్రీ ద్వారా 15 లక్షల రూపాయల వరకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయం. పేదల కుంటుబాలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది. ఎల్ఐసీ ద్వారా పేదలకు పూర్తి బీమా ప్రీమియం చెల్లించడం, 5 లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం కల్పించడమనేది ఇప్పటివరకు ఏ సర్కారు చేయలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి.

–బోయబోయిన భిక్షం, మూసీఒడ్డు సింగారం, పాలకవీడు మండలం